



అరె..టి మేళా భళా?

అరె అరటిలో ఇన్ని రకాలు ఉన్నాయా.. చూస్తుంటే కొత్తగా ఉందే.. అవును మరి అరటిలో రకాల గురించి అడిగితే ఎవరైనా సరే ఒకటో రెండో రకాలు చెబుతారు.. ఇక్కడ చూడండి ఎన్ని రకాలు ఉన్నాయో.. కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని రకాల అరటి ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. అరటి రకాలను చూసి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆశ్చర్యపోయారు. అంతే కాదండోయ్ కంద, చేమ, పసుపు ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. పెద్దఎత్తున శాస్త్రవేత్తలు, రైతులు తరలివచ్చారు.

6

కాకినాడ కోర్ట్ నుంచే..!

ఈ అమ్మాయి ఎవరో గుర్తుపట్టారా? ఈమె ఏమైనా సెలబ్రిటీనా గుర్తుపట్టడానికి అంటారా..! అవును సెలబ్రిటీనే.. ఎక్కడా మేం చూడలేదే అంటారా.. అయితే ఇటీవల విడుదలై హిట్ సాధించిన 'కోర్ట్' సినిమా చూడండి.. గ్యారంటీగా గుర్తుపడతారు.. ఎందుకంటే అందులో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి మన కాకినాడకు చెందిన అమ్మాయే.. అదృష్టం ఎవరికి ఏ రూపంలో వస్తుందో ఊహించలేమంటారు కదా.. ఈమెకు అంతే.. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసుకునే అమ్మాయి.. ఒక్కసారిగా హీరోయిన్‌గా మారిపోయింది.. హీరో నాని నిర్మాతగా తీసిన కోర్ట్ సినిమాలో అవకాశం దక్కింది. తొలి సినిమాతోనే హిట్ కొట్టింది.. ఈ సందర్భంగా ఆమెను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా పలు విషయాలు చెప్పుకొచ్చింది..

6

వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తులు

- ఇప్పటివరకు 350 దరఖాస్తులు
- పవర్ టిల్లర్లకు భలే డిమాండ్
- జిల్లాకు రూ.3.92 కోట్ల సబ్సిడీ సొమ్ము కేటాయింపు
- అదనంగా పవర్ టిల్లర్లు కేటాయించాలని ప్రతిపాదనలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం పెద్దఎత్తున దరఖాస్తు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నుంచి 60 శాతం వరకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తోంది. జిల్లాలో రైతులకు యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించి ఉత్పాదకతను పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ రబీసీజన్‌లో 1780 పరికరాలకుగాను రూ.3.92 కోట్లు సబ్సిడీ నిధులు కేటాయించింది. ప్రధానంగా పవర్ టిల్లర్లు, బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో దున్నే పరికరాలు, రోటోవేటర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు కేటాయించింది. ఈనెల 12వ తేదీ నుంచి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు 350 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా దరఖాస్తులు పవర్ టిల్లర్ల కోసం వచ్చాయి. జిల్లాకు 139 పవర్ టిల్లర్లు కేటాయించారు. పవర్ టిల్లర్లకు భారీగా డిమాండ్ ఉండడంతో మరో 50 పవర్ టిల్లర్లు కావాలని ప్రభుత్వానికి వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో వరి ప్రధాన పంట కావడంతో పవర్ టిల్లర్లకు భారీగా డిమాండ్ ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కస్టమ్ హైరింగ్ కేంద్రాల ద్వారా బృందాలకు పరికరాలు పంపిణీ చేసింది. అయితే తగినన్ని నిధులు కేటాయించకపోవడం వల్ల రైతులు పూర్తి స్థాయిలో పొందలేకపోయారు. సిఫార్సులతో వైసీపీ నాయకులే పొందారు. అయితే కూటమి ప్రభుత్వం బృందాలకు కాకుండా వ్యక్తిగతంగా రైతులకు యంత్ర పరికరాల సబ్సిడీపై ఇస్తోంది.

అప్‌లోడ్ చేస్తున్నాం..

ఇప్పటివరకు యంత్ర పరికరాలకోసం 350 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను పంపిణీ చేస్తాం. రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. పవర్ టిల్లర్లుకు డిమాండ్ ఉండడంతో అదనంగా కావాలని కోరాం.

- విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు



దారుణంగా చితికిపోతున్న బతుకులు

ఆ నాన్నకు పిల్లలను చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది..? ఆ దంపతులకు ఊపిరి తీసుకునేంత కష్టం ఎందుకొచ్చింది..? మరో యువకుడి బలవన్మరణానికి కారణం ఏంటి..? ఈ ప్రశ్నలన్నింటి వెనుక ఉన్నది ఒక్కటే జవాబు అదే అప్పు.. ఆ నాన్న తను లేకపోతే తన పిల్లలను ఎలా చూస్తారోననే భయంతో తన కంటిని తానే పొడుచుకున్నాడు.. క్షణికావేశంలో కుమార్తెను బలి తీసుకున్నాడు.. జైలు పాలయ్యాడు.. కాకినాడకు చెందిన దంపతులు ఇంటిని నిర్మించి అప్పుల పాలయ్యారు.. ఆ ఇంటిని అమ్మేసినా అప్పులు తీరక గోదావరిలో దూకి తనువు చాలించారు.. కోనసీమ జిల్లా బండార్లంకకు చెందిన బాగా బతికిన ఒక కుటుంబం అప్పులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.

- ఆదాయాన్ని మించి ఖర్చులు
- అనవసర ఆడంబరాలు
- పెరుగుతున్న అప్పులు
- నలిగిపోతున్న జనం
- తీర్చలేక బలవన్మరణాలు
- కుటుంబాలూ బలి
- బ్యాంకు రుణాలు అధికమే
- జిల్లాలో రూ.91 వేల కోట్లు
- వ్యక్తిగతం రూ.13 వేల కోట్లు
- ప్రైవేటు అప్పులు అదనం

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా చితికిపోయి.. తమ చితిని తామే పేర్చుకొని లోకం విడిచి వెళ్లిపోతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఇవాళ అత్యంత ఆందోళన కలిగించే అంశం. అప్పు అనే రెండక్షరాల ఊబి నుంచి బయటపడే అవకాశాలు కానరాక బలవంతంగా ఊపిరి తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులు.. సంపాదనకు ఉన్న వ్యత్యాసం ఉసురుతీస్తోంది. నెలంతా కష్టపడితే ఖాతాలో పడే జీతం మూడు రోజుల్లో ఆవిరి అయిపోతూ.. మా మాటేమిటంటూ 27 రోజులు ప్రశ్నిస్తుండడం నడుమ పేద, మధ్యతరగతి జీవితాలు నలిగిపోతున్నాయి. పిల్లలను చంపి, తామూ చావడానికి ధైర్యం కూడగట్టుకుంటున్నారంటే మరణాలను రుణాలు శాసిస్తున్నాయనే వాస్తవం పదేపదే రుజువు అవుతూనే ఉంది. అప్పులు లేని పేద, మధ్య తరగతి జీవులు భూతద్దం పెట్టి వెతికినా ఒక్కరూ కానరాని రోజులు నడుస్తున్నాయి. ఓ పదేళ్ల కిందట ఆత్మహత్యలు చాలా తక్కువ. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఏ కారణాలు చెప్పుకొన్నా ఆర్థిక ఇబ్బందులే అసలు రుగ్మత అనేది ఏవరూ కాదనలేని వాస్తవం. గతంతో పోలిస్తే ఈరోజు పిల్లల స్కూలు ఫీజుల దగ్గర నుంచి ప్లాట్‌ఫాంపై అమ్మకాలు సాగించే అరటి పండ్లతో సహా సుమారు 200 నుంచి 500 శాతం వరకూ ధరలు పెరిగిపోయాయి. నిత్యావసరాలు అంతే. దీంతో మనుగడకు అప్పులు తప్ప వేరే దారి కానరావడం లేదు. గతంలో కుటుంబ కలహాలు ఎక్కువగా ఉసురుతీస్తే ఇవాళ ఆ స్థానాన్ని ఆర్థిక ఇబ్బందులు భర్తీ చేస్తున్నాయి. ఒకప్పుడు ఇల్లు కట్టుకున్నా, కూతురు పెళ్లి చేసినా అప్పులు తప్పవని చెప్పేవారు. ఇవాళ స్కూలు ఫీజు కట్టాలంటే రుణాలకు వెళ్లక తప్పడంలేదు. పోలీసు రికార్డుల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో గత ఏడాది 230 మంది, జనవరిలో 30 మంది, ఫిబ్రవరిలో 20 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. అసలు రికార్డులకు ఎక్కనివి ఇంకో అన్ని ఉంటాయని చెబుతున్నారు. ఈ మరణాల్లో సుమారు 70 శాతం మందిని ఆర్థిక ఇబ్బందులే చంపేశాయని తెలుస్తోంది. నెలకు రూ.20 వేల నుంచి రూ. 30 వేలు వస్తున్నా నెలాఖరున అప్పులు చేయాల్సిన పరిస్థితి.

ఎందుకు చంపావ్ నాన్నా..



రాయవరం : తన కంటిని తానే ఎవడైనా పొడుకుంటాడా.. ఈయన అదే చేశాడు.. కన్న పిల్లలనే కాలువలో తోసేశాడు..అయితే కుమార్తె మృతిచెందగా...కుమారుడు బయటపడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఎంతో బాగా బతికాడు.. గ్రామంలో అందినకాడికి అప్పులు చేయడంతోపాటు కొంతకాలం కిందట ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో రోటేషన్ ఆగిపోయింది.. మరోవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరిగిపోవడంతో చనిపోదామని నిర్ణయించుకున్నాడు.. తను చనిపోతే తన పిల్లల పరిస్థితేంటని ఆలోచించాడు. ఈనెల 17న పిల్లలను తీసుకెళ్లి కాలువలో నెట్టేశాడు.. కుమార్తె మృతిచెందగా కుమారుడు బయటపడ్డాడు. చనిపోదామనుకున్నా ధైర్యం సరిపోలేదు. బంధువుల ఇంటికి వెళ్లగా వారు మందలించడంతో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. క్షణికావేశంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయం పచ్చని కుటుంబంలో తీరని శోకం మిగిల్చింది. ఏడేళ్ల అల్లారు ముద్దుగా పెంచి ఎందుకు ఆయువు తీశావు నాన్నా.. అంటూ చిన్నారి ఆత్మ ఘోషిస్తోంది.

అనవసర ఆర్భాటాలతోనూ..

దురాశ.. దుఃఖానికి చేటు అనే విషయాన్ని జనం గుర్తించకపోవడం మరో కారణం. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టుగా.. ఎదుట వ్యక్తి సంపాదించేస్తున్నాడు. మనం కూడా ఏదో ఒక రకంగా సంపాదించాలి. ఖరీదైన బైక్‌లు కొనేయాలి. లగ్జరీ కార్లలో తిరిగేయాలనే అత్యాశకు, అనవసర బిల్డప్‌కు పోయి కొందరు చిక్కులు తెచ్చుకుంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు యువత వ్యసనాలకు బానిసవుతున్నారు. బెట్టింగ్, ఇతరత్రా జూదక్రీడలకు అలవాటు పడుతున్నారు. వీటిలో సంపాదించింది గోరంతైతే.. పోగొట్టుకునేది కొండంత. స్టాక్ మార్కెట్లు, షేర్లలో డబ్బులు పెట్టిన వారు ఎందరో నష్టాల బారినపడుతున్నారు. ఇవన్నీ బయటకు చెప్పుకోలేక లోలోపల సతమతవుతున్నారు. చేసిన అప్పులకు వాయిదాలు కట్టలేక కొత్త అప్పులు చేస్తున్నారు. ఇలా అప్పుల మీద అప్పులు చేసి కొందరు చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఆర్థికంగా అగచాట్లు..

కొవిడ్ 19 తర్వాత చాలా మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. కొన్నిచోట్ల పరిశ్రమలు మూతపడడం, చాలామంది ఉద్యోగాలు పోవడం.. చేసేందుకు పని కూడా దొరకని పరిస్థితి. చేసిన అప్పులు తీర్చలేక.. కొత్త అప్పు పుట్టక నానాయాతనపడ్డారు. మరోవైపు ఇదే సమయంలో అప్పులు ఇచ్చే ఫైనాన్షియర్లు కూడా సరైన హామీదారులు ఉంటేనే అదీ కూడా బాగా తెలిసిన వారైతేనే రుణాలు ఇస్తుండడంతో చాలా మంది ఆర్థిక అగచాట్లు పడుతున్నారు. మరోవైపు బ్యాంకులు కూడా సిబిల్ స్కోర్ బాగుంటేనే లోన్లు మంజూరు చేస్తుంటే.. అవీ సరిగా లేని సామాన్యులు నలిగిపోతున్నారు.

ఉమ్మడి జిల్లా బ్యాంకుల్లో రుణాలు రూ.91,089 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు పలు కారణాలతో బ్యాంకుల వద్ద వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ఇది కాకుండా ఫైనాన్స్ కంపెనీలు, బంగారంపై రుణాలు ఇచ్చే సంస్థలు, వ్యాపారులంతా కలిపి ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్యాంకుల బ్రాంచిల్లో రూ.91,089 కోట్ల రుణాలు తీసుకున్నాయి. కాకినాడ జిల్లాలో రూ.33,844 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.23,514 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.33,731 కోట్లు. ఈ మొత్తంలో వ్యక్తిగత రుణాలు రూ.13 వేల కోట్లు పైనే. పేద, మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకుల కంటే తాకట్టు, వడ్డీ వ్యాపారులు, ప్రైవేటు ఫైనాన్స్‌ల నుంచి తీసుకుంటున్న అప్పులే అధికమని.. ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని ఆత్మహత్యల వరకు వెళుతున్న అనేక కుటుంబాల గురించి కాకినాడ జిల్లా బ్యాంకింగ్ నిపుణులు విశ్లేషించడం గమనార్హం.

అప్పులు తీర్చాలని అర్జీలు

కాకినాడలో ఓ పేద కుటుంబానికి చెందిన ఓ వివాహిత తన కుమార్తె వివాహానికి రెండక్షరాలున్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇంటిని తాకట్టు పెట్టి రూ.15 లక్షల రుణం తీసుకుంది. ఆ మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో ఇంటి జప్తునకు సదరు కంపెనీ నోటీసులు పంపింది. లబోదిబోమన్న ఆమె కంపెనీని వేడుకున్నా కనికరించలేదు. దీంతో ఈనెల 17న గ్రీవెన్స్‌లో కాకినాడ జిల్లా జేసీని కలిసి ప్రభుత్వం ద్వారా తన అప్పు తీర్చాలని వేడుకుంది. అవాక్కయిన జేసీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులను పిలిచి కొంత సమయం ఇవ్వాలని కోరినా వినకుండా మహిళ ఇంటిని జప్తు చేసేసుకుంది. దీంతో సదరు మహిళ నిలువనీడ కోల్పోయి తీవ్రంగా సతమతమవుతోంది.. ఇలా ఈమే కాదు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బతకలేక.. బతుకుబండి ఈడ్చలేక నరకయాతన పడుతున్నాయి. తమ ఆర్థిక భారాన్ని ప్రభుత్వం తీర్చు తుందేమోననే అమాయకపు ఆశతో కొందరు జీవిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు పలు అర్జీలు రావడమే నిదర్శనం. ఈ తరహా విజ్ఞప్తులు పిఠాపురం నియోజకవర్గం నుంచి భారీగా వెళ్లడంతో ఆమధ్య డిప్యూటీ సీఎం పవన్ సైతం అప్పులు తీర్చాలంటూ జనం విజ్ఞప్తి లేఖలు రాయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

బతుకు జీవుడా..!

కాకినాడ రూరల్ మండలానికి చెందిన నితీష్ మెడికల్ రిప్‌గా పనిచేసేవాడు.. వచ్చిన ఆదాయం సరిపోక అక్కడక్కడా అప్పులు చేశాడు.. చివరకు తన ఇంటిపై బ్యాంకులో లోన్ పెట్టి చిన్నచిన్న అప్పులు తీర్చేసి.. మిగిలిన సొమ్ముతో మెడికల్ బిజినెస్ చేశాడు. అయినా లాభంలేదు. ఓ పక్క బాకీదారుల ఒత్తిళ్లు, మరోపక్క పూటగడవని పరిస్థితులు.. కుటుంబమంతా కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. తర్వాత తమకున్న ఇంటిని అమ్మితే గట్టెక్కవచ్చుని ఆలోచించారు. సొంతింటిని అమ్మేసి అప్పులు తీర్చేశారు. సామర్లకోట మండలం మాధవపట్నానికి చెందిన నరేంద్ర డిగ్రీ వరకు చదివి ఉద్యోగం కోసం కాకినాడ గాంధీ నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావుకు అప్పులు చేసి రూ.5 లక్షల వరకు సమర్పించాడు. ఒకసారి ఢిల్లీలో ఇన్‌కంటాక్స్ ఆఫీసులో ఉద్యోగం అని.. రెండోసారి రాష్ట్ర రాజధాని అమరావతి సెక్రటేరియేట్‌లో ఉద్యోగం చూశానని మోసగించాడు. ఓపక్క ఉద్యోగం పేరుతో మోసపోవడం, అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో ఆత్మహత్యే శరణ్యమని భావించి చివరికి పోలీసులను ఆశ్రయించాడు. వీరేకాదు.. ఎంతో మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులై అనేక మంది బతుకు జీవుడా అని కాలం వెళ్లదీస్తున్నారు. కొవిడ్ తర్వాత సగటు జీవిబతుకు చిత్రం పూర్తిగా మారింది. చాలీచాలని వేతనాలు.. పెరుగుతున్న ధరలు అగాధంలోకి నెట్టేస్తున్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ. చిత్రంలో బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మల్లికార్జున, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు రాజప్ప, కొండబాబు

ఆదరణ-3 పథకం ద్వారా బీసీలకు ఆధునిక పనిముట్లు

- బీసీ కులవృత్తుల ప్రోత్సాహానికి రూ.వెయ్యి కోట్లు నిధులు
- రేపు కలెక్టరేట్‌లో వికాసలో భారీ ఉద్యోగ మేళా
- బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఆదరణ-3 పథకం ద్వారా ఆధునిక పరికరాలు, పనిముట్లు అందించి బీసీ కులవృత్తికారులకు మెరుగైన జీవనోపాదులను కల్పించనుందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ తెలియజేశారు. కాకినాడ కలెక్టరేట్ హాల్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున, కలెక్టర్ షాన్‌మోహన్ సంయుక్తంగా శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ కులవృత్తుల ప్రోత్సాహానికి రాష్ట్రప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు నిధులు కేటాయించి ఆదరణ-3 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. వృత్తిపనుల్లో వచ్చిన ఆధునిక సాంకేతికను బీసీ వృత్తికారులకు అందించి వారిని ఆర్థిక బలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించేందుకు ఆయా కులవృత్తి కారుల ప్రతినిధులతో తొలి వర్క్‌షాపును శనివారం కాకినాడలో నిర్వహించామన్నారు. ఈ వర్క్‌షాపులో 26 వృత్తి సంఘాల నాయకులు పాల్గొని కాలానుగుణంగా వృత్తుల్లో పెరిగిన సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఆదరణ -3 పథకం కింద ఆధునిక పరికరాలను పంపిణీ చేయాలని కోరారన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ వికాస సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జాబ్‌మేళా, వేసవి నుంచి రక్షణకు చేపడుతున్న చర్యలపై మీడియాకు వివరించారు. ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్‌లో వికాస కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని ఈ మేళా ద్వారా సుమారు 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నామన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాల కోసం 7799376111, 7799376444 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. జిల్లాలో యువత వాకిన్ డ్రైవ్‌కు హాజరుకావడం ద్వారా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ 10శాతం లబ్ధిదారుల వాటా, 90శాతం ప్రభుత్వ సబ్సిడీతో అమలుచేసే ఆదరణ-3 పథకంలో లబ్ధిదారుల చాయిస్ ప్రకారం వారు కోరుకున్న పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి టీడీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యోగ మేళాగోడ పత్రికను ఆవిష్కరించగా, అసిస్టెంట్ కలెక్టర్ భావన, వికాస పీడీ లచ్చారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి లల్లి పాల్గొన్నారు.

బీసీ కులవృత్తి, చేతివృత్తిదారులతో ముఖాముఖి విజయవంతం

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదరణ-3 పథకంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వెనుకబడిన తరగతుల్లో గత కులవృత్తి, చేతి వృత్తిదారులతో శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఆదరణ-3 పథకం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలుచేయనున్నదన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని బీసీ వర్గాల్లోని ఉన్న వివిధ కులవృత్తులు, చేతి వృత్తులు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆదరణ-3 పథకం కింద వివిధ వృత్తులపై ఆధారపడి పనిచేస్తున్న వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చేతివృత్తుల సంఘాల ప్రతినిధులు ఆదరణ-3పథకం కింద ఎలాంటి పనిముట్లు అందజేస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందో తమ అభిప్రాయాలను ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ వీసీ, ఎండీ మల్లికార్జున్‌లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి లల్లి తదితరులు పాల్గొన్నారు.



శక్తి బైక్ టీమ్‌లను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

మహిళా భద్రతకు 'శక్తి' రక్షణ కవచం : ఎస్పీ

కాకినాడక్రైం, మార్చి22(ఆంధ్రజ్యోతి): మహిళలు వారి భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆపద సమయాల్లో రక్షణకోసం శక్తి టీమ్స్, యాప్ రక్షణ కవచంలో ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. శనివారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో 30 శక్తి పెట్రోలింగ్ వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించేందుకు శక్తి యాప్ దోహదం చేస్తుందన్నారు. ప్రతీ ఒక్క మహిళ, గృహిణి, విద్యార్థినిలు, బాలికలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు సేవలను వినియోగించుకోవాలన్నారు. మహిళా చట్టాలు, రక్షణ కోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నెంబర్లు, డ్రగ్స్ సైబర్ నేరాలు, పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లాలో 4 బృందాలుగా శక్తి టీమ్స్ పనిచేస్తాయని, ఇందులో కాకినాడ సబ్ డివిజన్‌లో3, పెద్దాపురం సబ్‌డివిజన్‌లో 1 బృందం పనిచేస్తాయన్నారు. బాడీవార్న్ కెమెరాలు వినియోగిస్తారన్నారు. ఈ బృందానికి మహిళా ఎస్ఐ ఇన్‌చార్జిగా ఉంటూ పర్యవేక్షణ చేస్తారన్నారు. శక్తి యాప్‌పై అవగాహన కల్పించి, అధికసంఖ్యలో డౌన్‌లోడ్ చేసుకునేవిధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా శక్తియాప్ లోగోని ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ట్రైనీ జీవనలకు ఎస్పీ అందించారు. ఏఎస్పీ (ఏఆర్) శ్రీనివాసరావు, ఎస్డీపీవోలు మనీష్ దేవరాజ్ పాటిల్, శ్రీహరిరాజు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రామచంద్రరావు, మహిళా ఎస్ఐలు లలితాదేవి, లక్ష్మీకాంతం, దుర్గాదేవి పాల్గొన్నారు.

కాకినాడ నాకు చాలా స్పెషల్!

కథలెన్నో చెప్పారు.. కవితల్ని రాశారు.. కాలాలు దాటారు.. యుద్ధాలు చేశారు ప్రేమలో.. తప్పు లేదు ప్రేమలో..

కొద్దిరోజులుగా ఎక్కడ విన్నా ఇదే పాట.. యూట్యూబ్, ఇన్‌స్టా, రీల్స్.. ఇలా ఏ సోషల్ మీడియాలో చూసినా ఇదే పాటలో వేసిన స్టెప్పుల మోతే.. 'కోర్ట్' సినిమాలో ప్రధాన ఆకర్షణగా అందులో నటించిన యువజంట నిలిచారు. ట్రెండింగ్‌లో రికార్డులు బద్దలుకొట్టారు. ఈ యువజంటలో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి అప్పల సొంతూరు కాకినాడే. సర్పవరంలో ఉండే ఈ టీనేజ్ అమ్మాయితో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' జరిపిన చిట్‌చాట్...

'కోర్టు' చిత్రం హీరోయిన్ శ్రీదేవితో చిట్‌చాట్

ప్రశ్న: హాయ్ అండి.. ఎలా ఉన్నారు..

జవాబు : బాగున్నాను అండీ.

ప్ర: మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి?

జ: మా అమ్మ నీలిమ అప్పల. నా జీవితానికి అతిపెద్ద స్తంభం. తను ఎప్పుడూ నాకు మద్దతుగా ఉంది. అలాగే మా అక్క ఒక పిల్లర్. ఎప్పుడూ నన్ను గైడ్ చేస్తూ, ప్రోత్సహిస్తూ ఉంటుంది. వాళ్లిద్దరి ప్రేమ, సహాయం లేకుండా నేను ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టే అవకాశం ఉండేది కాదు.

ప్ర : మీది కాకినాడేనా..

జ: అవును. కాకినాడలోని సర్పవరంలో ఉంటున్నాం. శ్రీచైతన్య ఇంటర్నేషనల్‌లో టెన్త్ వరకు చదివా. శుభానికేతన్‌లో ఇంటర్. నా బాల్యమంతా కాకినాడలోనే. అందుకే కాకినాడ నాకు చాలా స్పెషల్.

ప్ర : మీ స్నేహితులు టచ్‌లో ఉన్నారా...

జ: ఎందుకు ఉండరు.. నాకు చిన్నప్పటి స్నేహితులు కూడా టచ్‌లో ఉన్నారు. వాళ్లతో కలిసి గడిపే సమయం నాకు చాలా ప్రీషియస్.


కాకినాడ బీచ్‌లో (ఫైల్)

- ఆంధ్రజ్యోతి, కాకినాడ కార్పొరేషన్


శ్రీదేవి



కోర్ట్ చిత్ర నిర్మాత హీరో నానితో అమ్మ నీలిమ, అక్క దివ్యతో శ్రీదేవి

అమ్మ చేతి వంట ఇష్టం..

ప్ర : సినీ రంగంలోకి ప్రవేశం ఎలా జరిగింది..

జ: నాకు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉండేది. అది గమనించిన మా అక్క ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడానికి ప్రోత్సహించింది. కొన్ని ఆడిషన్ల తర్వాత 'కోర్టు' చిత్రం హీరోయిన్‌గా అవకాశం రావడం నాకు పెద్ద బ్రేక్.

ప్ర : మీ రెగ్యులర్ లైఫ్ స్టైల్ ఎలా ఉంటుంది? మీ హాబీస్..

జ: నా డే స్ట్రిక్ట్ షెడ్యూల్‌లో ఉంటుంది. ఫిట్‌నెస్, డాన్స్, స్క్రిప్ట్ చదవడం అన్నీ ప్లాన్ చేస్తాను. హాబీస్‌లో ట్రావెలింగ్, మ్యూజిక్ వినడం ఇష్టం.

ప్ర : గోదావరి జిల్లాల్లో ఏ ప్రాంతాల్లో, ఏ ఫుడ్ అంటే మీకు ఇష్టం..

జ: నాకు ఇంట్లో అమ్మ వండిన వంటకాలు ఇష్టం. పూర్తిగా శాకాహారి అయిన నేను హోం కుక్డ్ ఫుడ్‌ను ప్రిపర్ చేస్తాను. గోదావరి జిల్లాలోని పచ్చళ్లు, ప్రత్యేకమైన వంటకాల రుచి మరుపురాని అనుభూతినిస్తాయి.

శ్రుతిహాసన్.. నాకు ఇన్‌స్పైరింగ్

ప్ర : మీ అభిమాన హీరో, హీరోయిన్లు..

జ: నాకు పవన్‌కల్యాణ్‌గారి స్టైల్, నాని గారి నేచురల్ యాక్టింగ్ చాలా ఇష్టం. హీరోయిన్లలో శ్రుతిహాసన్ వర్క్ నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది.

ప్ర: మీ డ్రీమ్ ఏంటి? ఎవరితోనైనా కలిసి వర్క్ చేయాలని ఉందా..

జ: నా డ్రీమ్ మంచి పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో ఉండాలి. డైరెక్టర్ రాజమౌళి గారి సినిమాలో నటించాలన్నది నా కల.

ప్ర: ప్రస్తుతం ఏ ప్రాజెక్టులు చేస్తున్నారు..

జ: ప్రస్తుతం కొత్త ప్రాజెక్టు అంగీకరించా. ఆ మూవీకి వర్క్ చేస్తున్నాను. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వస్తుంది.


అక్క దివ్యతో

ఆ స్టెప్ కోసం.. పది నిమిషాలే..

ప్ర : కోర్ట్ సినిమాలో మీకు బాగా గుర్తింపు తెచ్చిన జాబిలి పాత్ర కోసం మీ అభిప్రాయం..

జ: జాబిలి పాత్ర నాకు చాలా స్పెషల్. ఆ పాత్రలో భావోద్వేగాలను డీప్‌గా చూపించే ఛాలెంజింగ్ రోల్. ప్రేక్షకుల స్పందన నన్ను మరింత ఉత్సాహపరిచింది.

ప్ర : కోర్ట్ మూవీలో మీరు హీరోయిన్‌గా చేయడాన్ని ఎలా ఫీల్ అవుతున్నారు..

జ: ఇది నా కెరీర్‌లో ఒక గొప్ప మైలురాయి. నా మీద నమ్మకంతో ఈ పాత్రను ఇచ్చిన నానిగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ఈ ఛాన్స్ నాకు దొరకడం, దర్శకుడి గైడెన్స్‌లో నటించడం, ప్రేక్షకుల ప్రేమ పొందడం ఇవి అన్నీ నాకు మరిచిపోలేని అనుభవాలు.

ప్ర : షూటింగ్‌లో మీకు ఏమనిపించింది.. మీతోటి యాక్టర్స్ సహకారం ఎలా ఉంది..

జ: షూటింగ్‌లో మా టీమ్ సపోర్ట్ చాలా బాగా లభించింది. నటనలో వాళ్ల నుంచి నేర్చుకోవడం ఒక మంచి అనుభవం.

ప్ర : ప్రమోషన్‌లో భాగంగా మీరు వేస్తున్న స్టెప్పు ఎన్ని రోజులు నేర్చుకున్నారు..

జ: నిజం చెప్పాలంటే ఆ స్టెప్పును నేర్చుకోవడానికి నాకు కేవలం పది నిమిషాలే పట్టింది. డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే త్వరగా గ్రాసెప్ చేసుకోగలిగాను. ఆ స్టెప్ బాగా క్లిక్ అవడంతో ప్రమోషన్‌లో భాగంగా ఆ స్టెప్ అందరితో కలిసి వేస్తున్నా.




మండపేట బైపాస్‌లో..

ప్రకృతి రమణీయత

చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టు, పర్యాటక ప్రాంతాలైన ఫోర్ బై జలాశయాల, సీలేరు నది పొడవునా ప్రకృతి రమణీయ దృశ్యాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. తొలి, మలి సంధ్య వేళ ఉషా కిరణాలు జలాశయాన్ని తాకినప్పుడు ప్రకృతి చిత్రాలు సాక్షాత్కరిస్తున్నాయి. ప్రస్తుతం జలాశయం సందర్శనకు వెళ్లినవారంతా వీటిని చూసి పులకించిపోతున్నారు. అలాగే మండపేట బైపాస్‌లో శనివారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తూ ప్రకృతి ప్రేమికులను ఇలా ఆహ్లాదపరిచాడు.. ఈ దృశ్యాలు శనివారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

- మండపేట, మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యం

● కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ● ఐడీఎల్‌లో ముగిసిన జాతీయ స్థాయి సదస్సు



రూరల్ ఎమ్మెల్యే నానాజీని సత్కరిస్తున్న అతిథులు, డైరెక్టర్లు

కాకినాడ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీఎల్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి సదస్సు శనివారం సాయంత్రంతో ముగిసింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విద్యార్థులు చదువును కేవలం ఉద్యోగాలుచేయడానికే కాదని, స్వయం ఉపాధి, వ్యాపార సంస్థలు నెలకొల్పడం మీదా దృష్టి కేంద్రీకరించాలన్నారు. కళాశాలల్లో విద్యార్థులకు భద్రత, వనరుల కల్పన కోసం తాను విద్యాశాఖ మంత్రికి తెలియజేశానన్నారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి సీహెచ్ గణపతి, జే.పాండురంగారావు, రామకృష్ణ, యమున, వీవీఎస్ఆర్, శివరామకృష్ణ తదితర ప్రొఫెసర్లు ప్రసంగించారు. కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, గవర్నింగ్ బాడీ కార్యదర్శి పీఎస్‌కిరణ్, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు ఎం.రంజిత్, కేఎస్ వాసు, ప్రిన్సిపాల్ టీ.సత్యనారాయణ, కన్వీనర్ స్టీవెన్‌రాజు, విభాగాధిపతులు ఈశ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొనగా ఉపన్యాసకులకు, విద్యార్థులకు సర్టిఫికెట్లను అతిథుల చేతులమీదుగా అందజేశారు.

జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్

● సివిల్ విభాగం ఆధ్వర్యంలో సాధ- 2 కే 25 పేరుతో నిర్వహణ



టెక్‌ఫెస్ట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, మార్చి22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ (కే) వర్సిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సాధ- 2 కే 25 పేరుతో రెండురోజుల పాటు జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా కేఎస్‌పీఎల్ డీజీఎం పీ.రవికుమార్, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ విశిష్ట అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి, సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ స్టార్టప్‌లకు టెక్‌ఫెస్ట్‌లు మంచివేదికగా నిలుస్తాయన్నారు. దేశం మొత్తం మీద తొలుత ఇక్కడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోర్టు కార్యకలాపాలను పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. అనంతరం వీసీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టెక్ ఫెస్ట్‌లు దోహదపడతాయన్నారు. వచ్చేఏడాదికి 1500 మంది సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆడిటోరియం అందుబాటులోకి రానుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రాజెక్టులు, వర్క్‌షాప్స్ పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ఎగ్జిబిషన్స్‌ను ఉపకులపతి సందర్శించారు. విద్యార్థులకు డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్, తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్డీ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులు తయారు చేసిన హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న వీసీ

గోవిందా... గోవింద

» వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

» స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరు మల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52,39,730 లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మండువేసవిలో ఎండవేడిని సైతం లెక్కచేయకుండా స్వామివారి ప్రదక్షణలు ముగించుకుని గంటల తరబడి క్యూలైన్లలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు స్పృహకోల్పోగా వైద్య సిబ్బంది సేవలు అందించారు.

కేశవస్వామిని దర్శించుకున్న ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్

పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ వైజాగ్ కె.మధుసూదన్ కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వాదం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఇన్‌కం ట్యాక్సు కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

రాయవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ బీమేశ్వరస్వామి ఆలయానికి వాయువ్యంలో చంద్రప్రతిష్ఠ శివాలయంగా పేరుగాంచిన మండలంలోని సోమేశ్వరం శ్రీబాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో సోమేశ్వరస్వామి, అమ్మవారిపై శనివారం సాయంత్రం సూర్యకిరణాలు నేరుగా తాకాయి. ప్రతిఏటా మార్చి నెలలో ఫాల్గుణమాసంలో ఒక్కరోజు స్వామి, అమ్మవారి మూలవిరాట్‌పై సూర్య కిరణాలు తాకుతూ ఉంటాయి. శనివారం సూర్యాస్తమయం సమయంలో సూర్యకిరణాలు సోమేశ్వరస్వామిని తాకడంతో ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, హారతులు నిర్వహించారు. సోమేశ్వరం పరిసర ప్రాంతాల భక్తులు సోమేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


స్వామిని తాకిన సూర్య కిరణాలు

పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించిన వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల పరిధిలోనే ఎక్కువ మంది పరీక్షలు రాస్తారని ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. అందుకే పరీక్షల నిర్వహణపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల్లో సోమవారం నుంచి డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం కావడంవల్ల తాగునీరు అందుబాటులో ఉంచాలని, కరెంటు సమస్య లేకుండా శుభ్రమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 109 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో 2500 మంది, లా 8, 10 సెమిస్టర్ పరీక్షలకు మూడు కేంద్రాల్లో 500 మంది హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను కళాశాలల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలిపారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన మద్రాస్ హైకోర్టు జడ్జి

కడియం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) మద్రాస్ హైకోర్టు జడ్జి వి.శివజ్ఞానం శనివారం కడియపులంక పుల్లా అబ్బులు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. అబ్బులు ఆగ్లోనిమా సిల్వర్ మొక్కను అందజేసి స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్ మొక్కలను చూశారు. వాటి వివరాలు, శాస్త్రీయనామాలు, మొక్కల పెంపకంపై పుల్లా వీరబాబు, రాజశేఖర్ వివరించారు. వివిధ రకాల మొక్కలు ఒకే చోట చూడడం సంతోషంగా ఉందని జడ్జి శివజ్ఞానం అన్నారు.


మద్రాస్ హైకోర్టు జడ్జి శివజ్ఞానంకు మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

గోదావరి డెల్టాకు సీలేరు నుంచి నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలో వ్యవసాయ అవసరాల కోసం సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా మరో 1000క్యూసెక్కులు పెంచి 4వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 3వేల క్యూసెక్కులకుపైగా గోదావరికి విడుదల అవుతోంది. దీంతో గోదావరిలో నీటిలభ్యత 10,700 క్యూసెక్కులుగా నమోదయింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.85 నమోదైంది.

జీజీహెచ్‌లో రెండు జీబీఎస్ కేసులు

జీజీహెచ్(కాకినాడ), మార్చి (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవలకోసం ఇద్దరు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బాధితులు చేరినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు బాధితులు చికిత్స పొందుతుండగా, ఇద్దరి చేరికతో మొత్తం ఐదుగురు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఏమి హాయిలే ఇలా...

● ఆ రహదారిపై ప్రయాణం కూల్ కూల్

రాజానగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆ రహదారిలో ప్రయాణం హాయిగా సాగిపోతోంది. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు ప్రయాణికులు మార్గమధ్యంలో ఆగి కొంచెంసేపు చెట్ల నీడన సేదతీరుతున్నారు. రాజానగరం-అనపర్తి ప్రధాన రహదారికి ఇరువైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద ఉన్న చెట్లు ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. వృక్షాలకు తోడు చెరువు నుంచి వీస్తున్న చల్లని గాలిలో ఏమి హాయిలే ఇలా అనుకుంటూ ఈ రోడ్డుపై వెళుతున్న వాహనదారులతోపాటు గ్రామానికి చెందిన వారు సైతం మధ్యాహ్నం సమయంలో ఇక్కడకు చేరుకుని కొంతసేపు విశ్రమించిన అనంతరం బయలుదేరుతున్నారు.


రాజానగరం-అనపర్తి ప్రధాన రహదారికి ఇరు వైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద చెట్లు నీడ

రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

» కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రంలో కిసాన్‌మేళా-2025

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహకారాన్ని అందిస్తూ, రైతుల ఆర్థికాబివృద్ధికి తోడ్పాటునిస్తున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్‌మేళా-2025 నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డా.కె.గోపాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యానపంటల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఉద్యాన పంటల తోనే సాధ్యమన్నారు. విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా పరిశోధనా స్థానంలో అభివృద్ధి చేసిన యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. కొవ్వూరు ఉద్యానవన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి. లలితా కామేశ్వరి మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో 13 లక్షల టిష్యూ కల్చర్ మొక్కలను అందజేశామన్నారు. ఈ మేళా 25లో ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ని పరిశోధనా కేంద్రాలు అంబాజీపేట, పందిరిమామిడి, పెద్దాపురం, కేవీకే వెంకట్రామన్నగూడెం, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శనలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, దా యన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, అక్షయపాత్ర రవీంద్ర, శాస్త్రవేత్తలు డీ. వెంకటస్వామి, ఏ.స్నేహలత రాణి, రైతులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

గౌరీపట్నంలో ప్రారంభమైన
నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు



మేరీ మాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి జయరావు తదితరులు



నిర్మలగిరిలో ఆలయానికి విద్యుత్ అలంకరణ

దేవరపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేరీమాత మహోత్సవాల సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుణ్యక్షేత్రం అఖండ దేవాలయంలో ఏర్పాటు చేసిన బైబిల్ ప్రదర్శనను తిలకించారు. నూతనంగా భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. నిర్మలగిరి మేరీ మాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచం సుఖ శాంతులతో ఉండాలనేదే మేరీమాత తల్లి ఆకాంక్ష అని పేర్కొన్నారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు గత 40 ఏళ్లుగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు ప్రేమ, దయ గుణం కలిగి ఉండాలన్నారు. సుఖజీవనం గడపాలని, సుఖశాంతులు అష్టఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థన లు చేయడం జరుగుతుందని తెలిపారు. మతాలు, ప్రాంతాలకతీతంగా ఈ ఉత్సవాలు నిర్వహించగా భక్తులు పాల్గొనడం ప్రత్యేకత అన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, పాదర్లు బాల, ప్రసాద్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు, పలువురు ఫాదర్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, వాడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకూ ప్రభుత్వం పొడిగించిందని ప్రిన్సిపాల్ వి.ఆనంద్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అనుసరించి 40 సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా http://mjpapbcwreis. apcfss.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

సామర్లకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట ఉండూరు రైల్వే గేట్ సమీపాన ఎన్‌ఎఫ్‌సీఎల్ పైప్‌లైన్ రోడులో ఆదివారం ఉదయం కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు జరుగనున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు చెప్పారు. వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ పేరిట నిర్వహించనున్న ఈ పోటీలను మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) హాజరవుతారన్నారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు, షీల్డ్ బహుమతులు, జూనియర్స్‌లో మొదటి అయిదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 32 జతల ఎడ్లు సామర్లకోటకు చేరుకున్నట్టు తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఏడుగురిపై కేసు

గొల్లప్రోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేయడమే గాక ప్రశ్నించినందుకు తమపై దాడి చేశారని తాటిపర్తికి చెందిన పేకేటి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై పాలికి సుబ్రహ్మణ్యం, బెందుకుర్తి డేవిడ్‌రాజు, బర్రె దుర్గాప్రసాద్, నాగేంద్ర, మరో ముగ్గురు మైనర్లపై కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఎవరెస్టు శిఖరం అధిరోహించడమే లక్ష్యం

భువనగిరిలో ట్రెక్కింగ్ శిక్షణ తీసుకున్న 14 ఏళ్ల అభిరాం



భువనగిరిలో శిక్షణలో భాగంగా ట్రెక్కింగ్ చేస్తున్న అభిరాం



మోతుగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న కొత్తపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సోడే తిరుపతమ్మ, అప్పారావుల కుమారుడైన 14ఏళ్ల అభిరాం పర్వతారోహణపై మక్కువ పెంచుకున్నాడు. భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరం అధిరోహించాలనేదే తన లక్ష్యమని తెలిపాడు. పర్వతారోహణపై మక్కువతో శిక్షణ తీసుకుంటున్నానని, ఆర్థిక సాయం అందింతే కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహిస్తానని ధీమా వ్యక్తం చేశాడు. చింతూరులోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఎవరెస్టు అధిరోహించిన వీఆర్‌పురం మండలం కుంజవారిగూడెంకు చెందిన కుంజా దుర్గారావు స్ఫూర్తి, సూచనలతో అభిరాం కిలిమంజారో పర్వతం ఎక్కాలనుకున్నాడు. అతడి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఈ నెల 14నుంచి 16 వరకు తెలంగాణలోని భువనగిరిలో ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కిలిమంజారో అధిరోహణ ఆర్థికభారంతో కూడుకోవడంతో వారు బుధవారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను ఆశ్రయించి తమ కుమారుడి ఆశ నెరవేర్చేందుకు ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయం చేయాలని కోరారు. స్పందించిన పీవో ముందుగా అభిరాంకు పాస్‌పోర్టు చేయించాలని, ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో
లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

అధిక ధరలకు విక్రయిస్తున్న 9మంది వర్తకులపై కేసులు



తనిఖీలు నిర్వహిస్తున్న మెట్రాలజీ అధికారులు

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వివిధ లైసెన్స్‌లు కలిగిన వర్తకసంస్థలపై శనివారం జిల్లా వినియోగదారుల ఫోరం ఆదేశాలు మేరకు 9మంది వర్తకులపై కేసులు నమోదు చేసినట్టు లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు యస్.జనార్ధన రావు తెలిపారు. వారిలో ఎమ్మార్పీ ధరల కంటే షాపులలో రూ.5 నుంచి 20 వరకు అధికంగా విక్రయిస్తున్నట్టు గుర్తించామని.. వర్తకులపై లీగల్ మెట్రాలజీ 2009, లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్ కమోడిటీస్ నియమావళి 2011 ఉల్లంఘనలు కింద కేసులు నమోదుచేయడం జరిగిందని పేర్కొన్నారు. దాడుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు సలీం, సరోజినీ, వివిఎస్ వివిఎస్.మోహన్, ఎస్.నాగేంద్రకుమార్, కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రిజిస్ట్రార్‌శాఖ ఉమ్మడి జిల్లా డీఐజీ వెంకటేశ్వరరావు



మండపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఐజీ వెంకటేశ్వరరావు

మండపేట మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రిజిస్ట్రార్‌శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీఐజీ ఎల్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కోనసీమ జిల్లా మండపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఫిబ్రవరి 22న వేళకు రిజిస్ట్రార్ రాకపోవడంతో కక్షిదారులు తాళం వేసిన సంఘటనపై శనివారం ఆయన విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన పోతురాజు సునీత ఫిబ్రవరి 22న మధ్యాహ్నం వరకు కార్యాలయానికి రాకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న కక్షిదారులు వేళకు రానపుడు కార్యాలయం ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేసి కార్యాలయానికి తాళాలు వేయించారు. ఆ రోజు విధులకు అలస్యంగా హాజరైన సునీతను శనివారం పిలిపించి విచారణ చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. కక్షిదారులకు ఇబ్బందులు కలిగించే చర్యలపై ఉపేక్షించేదిలేదని ఆయన హెచ్చరించారు.

వైభవంగా నూకాలమ్మ గరగల మహోత్సవం

పాల్గొన్న జబర్దస్త్ నటుడు దొరబాబు

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్యరోజున జరిగే మండపం నూకాలమ్మను జాతర పురస్కరించుకుని శనివారం కాకినాడ జిల్లా అన్నవరంలో గరగల మహోత్సవం మహిళలు, యువకుల కేరింతల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మండపం గ్రామం నుంచి 5కిలోమీటర్ల దూరం పూల గరగతో పాటుగా చిన్న గరగలతో నడిచి వచ్చారు. పూలగరగకు మహిళలు బిందెలతో నీళ్లుపోసి పసుపు, కుంకుమలు పూసి సారె, చీరలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు రావిచెట్టు సెంటర్‌లో గరగల మహోత్సవం జరిగింది. మండపం నూకాలమ్మ అన్నవరం అత్తివారి ఆడపడుచుగా పూజలందుకోవడంతో ముందుగా వారింటికి చేరుకుని అక్కడ పాన్పు అనంతరం నైవేద్యాలు సమర్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 4 వరకు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గరగల సంబరం జరిగింది. జబర్దస్త్ నటుడు దొరబాబు పాల్గొన్నారు.



గరగల మహోత్సవంలో పాల్గొన్న జబర్దస్త్ నటుడు దొరబాబు, గ్రామస్తులు

మహనీయుల విగ్రహాలకు అవమానం

- దూబచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- రాస్తారోకో నిర్వహించిన అంబేడ్కర్‌వాదులు, మాల మహానాడు నేతలు
- రంగంలోకి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్
- భారీ ఎత్తున పోలీసుల మోహరింపు





రాస్తారోకో నిర్వహిస్తున్న మాల మహానాడు నేతలు

దూబచర్ల గాంధీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దృశ్యం

నల్లజర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామ పంచాయితీ పరిధిలోని గాంధీ కాలనీలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియన వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. శనివారం ఉదయం చూసిన స్థానికులు మండలంలోని అంబేడ్కర్‌వాదులు, మాల మహానాడు నేతలకు సమాచారం తెలపడంతో వారు భారీ ఎత్తున తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న ఆదనపు ఎస్పీ సుబ్బారాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సిబ్బందితో హుటాహుటిన చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంఘటనా స్థలానికి వచ్చి అంబేడ్కర్‌ను అవమానపరిచిన దోషులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. రాస్తారోకో చేస్తున్న వారితో కలిసి రోడ్డుపై కూర్చుని సంఘీభావం తెలిపారు. ఈ విషయంపై మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని చెప్పుల దండతో అవమానపర్చారని, అక్కడ నూతన విగ్రహం ఏర్పాటు చేసి పైన షెల్టర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే తామే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డీఎస్పీకి వినతి పత్రం అందించారు. గోపాలపురం జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించి శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. డీఎస్పీ, సీసీఎస్ సీఐ అనుకూరి శ్రీనివాస్, దేవరపల్లి సీఐ బియస్ నాయక్, నల్లజర్ల సీఐ విజయశంఖర్ అంబేడ్కర్‌వాదులతో చర్చలు జరిపి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బోడిగడ్ల వెంకటేశ్వరరావు, కూరపాటి శ్రీను, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పిల్లి కాంతరావు, గుదే సుబ్బారావు, బొడిగడ్ల రాంబాబు, శ్రీరాములు, ఆదినారాయణ, కీర్తి రాజు పాల్గొన్నారు.

ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ

పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సర్పంచ్ శారదాదేవి

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి అవమానం జరిగింది. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు. ఉదయం చూసిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంటనే స్పందించి ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. గ్రామంలో గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉందని, మోటార్ వైర్లు, కోడిపుంజుల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై దృష్టి పెట్టాలని అక్కడకు వచ్చిన పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి శారదదేవి, రామకృష్ణ, కాకర్ల శేషగిరి, బొలుసు గంగరాజు, బొలుసు సుబ్బారావు, అయినపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన కృష్ణ

గండేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గండేపల్లికి చెందిన దోనాదుల కృష్ణ(50) మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కృష్ణ హైవే మెయింటిస్స్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం జాతీయ రహదారిపై వ్యాన్ నిలుపుదల చేసి సేఫ్టీ కోన్లు పెడుతుండగా వెనుక వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వ్యాన్, లారీకి మధ్యలో ఉండిపోయి కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. కృష్ణకు అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై ఆందోళన..

హైవే అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని మురారి, గండేపల్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కృష్ణ మరణంపై స్పందించి న్యాయం చేయాలంటూ ఆయన కుటుంబీకులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రహదారి శుభ్రపరిచేందుకు కొద్దిపాటి స్థలంలో కోన్లు ఏర్పాటు చేయాలని కాని రెండు కిలోమీటర్ల మేర ఎటువంటి పని లేకపోయిన కోన్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అనపర్తి ఎర్రకాలువలో యువకుడి గల్లంతు



శివకుమార్ (ఫైల్)

అనపర్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి ఎర్రకాలువలో శనివారం చినపొలమూరు గ్రామానికి చెందిన యువకుడు గల్లంతయ్యాడు. ఎస్ఐ శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. చినపొలమూరుకు చెందిన కడియాల శివకుమార్(29) శనివారం ఉదయం అనపర్తి పని నిమిత్తం వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో కాలువలోకి దిగి ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చి రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే శివకుమార్ కాలువలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అక్కడికి చేరుకుని పోలీసులకు, ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. పొద్దుపోయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో గాలింపు నిలుపుదల చేశారు. శివకుమార్ తండ్రి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అయినవాళ్లందరూ దూరమై.. ఒంటరి బతుకు భారమై...

తుల్యభాగ డ్రైన్‌లో దూకి మహిళ ఆత్మహత్య



మృతురాలు లక్ష్మి

కరప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడు, కన్నకొడుకులు, అల్లుడు.. ఇలా ఒక్కొక్కరిగా కడతేరిపోతుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఒక మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేళంగి ధళమ్మచెరువుగట్టుకు చెందిన బరగాటి లక్ష్మి(59)కి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె సంతానం. వృత్తిరీత్యా పిల్లలందరూ వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు. అయితే 2019లో లక్ష్మి భర్త సూర్యనారాయణమూర్తి, 2021లో చిన్న కొడుకు, 2023లో పెద్దకొడుకు, 5నెలల క్రితం అల్లుడు అనారోగ్యాలతో మృతి చెందారు. అయినవాళ్లందరూ ఇలా వరుసగా కళ్లముందే కన్నుమూయడంతో లక్ష్మి తీవ్ర మనోవేదనతో బ్రతుకీడుస్తుంది. ఒక్కగానొక్క కుమార్తె తల్లికి దూరంగా అనపర్తిలో ఉంటుండడంతో ఇక ఒంటరితనాన్ని ఎంతమాత్రం భరించలేని లక్ష్మి తనువు చాలించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో యండమూరు గ్రామానికి వెళ్లే దారిలో తుల్యభాగ డ్రైన్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం సాయంత్రం డ్రైన్‌లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా మృతురాలు లక్ష్మిగా నిర్ధారణ అయ్యింది. మృతురాలి మనవడు బరగాటి పోతురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

కుందేలును మింగి.. ప్రహరీ గోడ భాగంలో చిక్కి!

పవర్ ప్లాంట్‌లో కొండచిలువ హల్‌చల్





కుందేలును మింగి కదలేని స్థితిలో ఉన్న కొండచిలువ

గోకవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం బావాజీ పేట గ్రామ సమీపంలో పోలవరం కాలువ గట్టుపై ఉన్న పవర్ ప్లాంట్‌లో శనివారం కొండ చిలువ హల్‌చల్ చేసింది. విధుల్లో ఉన్న ప్లాంట్ సిబ్బందికి కొండ చిలువ కనబడడంతో ఆందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారి భాస్కర్ కృష్ణ, సిబ్బంది ప్లాంట్ వద్దకు చేరుకుని కొండచిలువను గమనించి స్నేక్ క్యాచర్‌ను రప్పించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన స్నేక్ క్యాచర్ గంట సేపు శ్రమించి కొండ చిలువను పట్టుకున్నారు. అయితే అప్పటికే కొండ చిలువ కుందేలును మింగి ఉండడంతో కదలలేక ప్లాంట్ ప్రహరీ గోడ అడుగు భాగంలో చిక్కుకుంది. చివరికి కొండ చిలువను పట్టుకుని దేవీపట్నం మండలం దండంగి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో వదిలేశారు.

ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నం

దేహశుద్ధి చేసిన స్థానికులు

పెద్దాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురంలో వ్యాపారం చేసుకుంటున్న కామేశ్వరరావు శనివారం 2వ, 7వతరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. బాలికల అరుపులతో అక్కడే ఉన్న స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీనిపై పెద్దాపురం ఎస్ఐ మౌనికను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గిరిజనుడి అనుమానాస్పద మృతి

ఆలస్యంగా వెలుగులోకి ఘటన

వై.రామవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం కె.యర్రగొండ గ్రామానికి చెందిన గిరిజనుడు మిరియాల సంకురుదొర (38) అనుమానాస్పదంగా మృతి చెందాడు. గురువారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంకురుదొర గురువారం వాడపల్లి సంతకు వెళ్లి వచ్చి సాయంత్రం కల్లు చెట్లకు వెళ్లాడు. అనంతరం గ్రామంలోకి వచ్చి శివారులో విగత జీవుడైన విషయం ఎవరికీ తెలియరాలేదని కుటుంబీకులు తెలిపారు. గ్రామస్తులు, కుటుంబీకులు మృతదేహాన్ని దహనం చేసేందుకు నిర్ణయించుకోగా పోలీసులకు సమాచారం అందడంతో శనివారం వై.రామవరం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

కిర్లంపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మండలంలో ముక్కొల్లు గ్రామానికి చెందిన అనపర్తి కృష్ణ (56) అనే కౌలు రైతు శనివారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి పొలం పనిచేస్తుండగా పాము కాటుకు గురై మృతిచెందినట్టు కిర్లంపూడి హెడ్‌కానిస్టేబుల్ ఎన్.వెంకటరమణ తెలిపారు. వివరాల ప్రకారం. ముక్కొల్లుకు చెందిన పోతాబత్తుల నందీశ్వరరావు అనే రైతు వద్ద కృష్ణ కౌలు భూమి తీసుకుని సాగు చేసుకుంటున్నాడు. శనివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో పొలానికి వెళ్లి పనులు చేసుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు. చుట్టుపక్కల రైతులు గమనించి అతన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ తరలించారు. మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పేర్కొన్నారు.

యానాం సబ్‌జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారీ



పరారైన ఖైదీ వెంకటేశ్వరరావు

యానాం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యానాం సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. దాదాపు 25 అడుగుల ఎత్తున్న సబ్‌జైల్ ప్రహరీ గోడ దూకి పరారయ్యాడు. యానాం కనకాలపేటకు చెందిన కే.వెంకటేశ్వరరావు ఓ చోరీ కేసులో శుక్రవారం అరెస్ట్ అయ్యాడు. ఈ కేసులో 6 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో శనివారం ఉదయం సబ్ జైలుకు తరలించగా మధ్యాహ్నం జైలు నుంచి పరారవ్వడం అధికారులను కంగుతినేలా చేసింది. అతడి కోసం యానాం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఉచిత కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

● డీఐఈవో జీజీకే నూకరాజు

కాకినాడరూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్‌టెస్ట్ (ఈఏపీసెట్) ఉచిత కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈవో)జీజీకే నూకరాజు సూచించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ అనంతరం ఏపీఈఏపీసెట్-2025 ప్రవేశపరీక్షకు ప్రిపేరవుతున్న పేదవిద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు ప్రోత్సాహంతో ఉచిత కోచింగ్‌ను నిర్వహిస్తుండగా ఆ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల మెటీరియల్‌ను పైడా వెంకటనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచితంగా సమకూర్చారు. ఈకోచింగ్ క్యాంప్‌ను డీఐఈవో జీజీకే నూకరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఏ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఈవిధంగా అన్ని వసతులు కల్పించి కోచింగ్ ఇవ్వడంలేదని ప్రతీవిద్యార్థి పట్టుదలతో చదివి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ప్రి న్సిపాల్ రాంబాబు మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఓఎన్‌జీసీ నిర్వహిస్తున్న సూపర్-30 ద్వారా జేఈఈ, నీట్‌లలో ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు అవగాహన ఒప్పందం చేసుకున్నామని అధ్యాపకులను కూడా ఎక్స్చేంజ్ చేసుకుంటామన్నారు. విద్యార్థులకు కోచింగ్‌తో పాటూ భోజనం,మెటీరియల్, అల్పాహారం ఉచితంగా అందజేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ డి.రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఐఈవో జీజీకే నూకరాజు

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ

పిఠాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా పిఠాపురం పట్టణంలో నీటిని పొదుపుగా వినియోగించుకుందాం-పర్యావరణాన్ని కాపాడుకుం దాం నినాదంతో శనివారం ర్యాలీ నిర్వహించారు. హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిపి పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో ప్లకార్డులతో నినాదాలు చేశారు. నీరు లేనిదే జీవం లేదు-జీవకోటికి మనుగడలేదు అని నినదించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు మమత హైస్కూలులో 8,9వ తరగతి విద్యార్థులకు నీటి పొదుపు-పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జోజిబాబు, మన ఊరు మన బాధ్యత సంస్థ అధ్యక్షుడు కొండేపూడి శంకరరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రామచంద్రరావు, పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

చిన్నచెరువుల తవ్వకాలను ప్రారంభించిన పీడీ

కొత్తపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచజల దినోత్సవం పురస్కరించుకుని కొత్తపల్లి మండలంలో అమరవల్లి,శ్రీరాంపురం గ్రామాల్లో శనివారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పారంపాండ్స్(చిన్నచెరువులు) తవ్వకాలను పథక సంచాలకులు అడపా వెంకటలక్ష్మి ప్రారంభించారు. చిన్న చెరువుల తవ్వకం ద్వారా అడుగంటిపోతున్న భూగర్భ జలాలను పరిరక్షించవచ్చునన్నారు. కాయగూరలు, పండ్ల తోట పెంపకానికి చిన్నచెరువులు ఉపయోగపడతాయని పీడీ తెలియజేశారు. సర్పంచులు రావి రమేష్, పులి జయబాబు, ఏపీడీ పి.వసంతమాధవి, ఎంపీడీవో పి.రవికుమార్, ఏపీవో కొండలరావు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'పంటపొలాలు ఖాళీగా ఉంచవద్దు'

పిఠాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రబీ సాగు అనంతరం పంటపొలాలును ఖాళీగా ఉంచవద్దని వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి సూచించారు. రబీ సాగు అనంతరం రానున్న ఖరీఫ్‌లో వరి సాగుకు అవసరమైన పోషకాలు అందించే ప్రణాళికలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కరప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం ఆర్యవటం గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో ఒక మహిళ మృతిచెందింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన పెంకే వీరామణి ఆర్యవటం శివారు బొక్కావారిపేటలో తన కుమార్తె నిర్మించుకుంటున్న ఇంటివద్ద పనిచేయడానికి వెళ్లింది. ఈ క్రమంలో ఫౌండేషన్‌లో వేసిన మట్టిని గుణపంతో కుమ్ముతుండగా పక్కనే ఉన్న విద్యుత్‌వైర్ గుణపం పోటుకు తెగి విద్యుత్ ప్రవహించింది. ఇది గమనించిన, పక్క ఇంట్లో అద్దెకుంటున్న గ్రామ మాజీ వార్డు మెంబర్ కాలా సత్యవతి(60) వీరామణిని కాపాడే ప్రయత్నంచేసి ఇద్దరూ విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. స్థానికులు అప్రమత్తమై కరెంట్ మీటర్ వద్ద ఫీజులు తొలగించారు. ఈ ఘటనలో సత్యవతి అక్కడికక్కడే మృతి చెందగా, వీరామణి క్షేమంగా బయట పడింది. ఈ ఘటనపై తమకెటువంటి ఫిర్యాదు అందలేదని గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

ట్రాన్‌జెండర్స్ నిరసన

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 22(ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ట్రాన్‌జెండర్ దీపును దారుణంగా హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ శనివారం సాయంత్రం భానుగుడి జంక్షన్ నుంచి బాలాజీ చెరువు వరకు ట్రాన్‌సెండర్స్ నిరసన ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. నిందితుడికి ఉరిశిక్ష వేయాలని నినదించారు. మహిళలకు, పిల్లలకు ప్రత్యేక చట్టాలు ఉన్నట్టే ట్రాన్‌జెండర్స్‌కు కూడా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జాహ్నవి, పండు, నాయకమ్మ, సర్పకం నాయకం పాల్గొన్నారు.

కూరాడలో చర్చి నిర్మాణంపై దీక్ష

కరప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కూరాడలో అక్రమ చర్చి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ శిబిరానికి హైందవ సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు పెనుగొండ దుర్గాప్రసాద్ విచ్చేసి నిరసనకారులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ఈ అక్ర మ చర్చి నిర్మాణంపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం హిందూసంఘాల ప్రతినిధులు, స్వామీజీలతో కలిసి మహాధర్నా చేపడతామని స్పష్టంచేశారు. ఈ రిలే దీక్షల్లో కోనసీమ హైందవ సైన్యం జిల్లా అధ్యక్షుడు గణేష్‌శర్మ, రామచంద్రపురం బీజేపీ నాయకుడు రాఘవేంద్రరావు, గజేంద్ర, సుబ్బలక్ష్మి, హైందవ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

అనర్హులకు నర్సరీ ప్రోత్సాహకాలు

● చేబ్రోలు పట్టుపరిశ్రమల కేంద్రం వద్ద రైతుల ధర్నా

గొల్లప్రోలురూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మల్బరీ సాగు చేస్తున్న రైతులకు అందించాల్సిన నర్సరీ ప్రోత్సాహకాలను అనర్హులకు ఇస్తున్నారని ఆరోపిస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టుపరిశ్రమల కేంద్రం వద్ద పట్టురైతులు శనివారం ధర్నా నిర్వహించారు. 53.19 ఎకరాల్లో 26మంది మల్బరీ సాగు చేసినట్లు అధికారులు గుర్తించారని వారు తెలిపారు. వాస్తవంలో 20 ఎకరాలకు మించి మల్బరీ సాగు చేయలేదని వారు చెప్పారు. నువ్వులు ఇతర పంటలు సాగు చేసిన వారికి ఎకరానికి రూ.22,500 వంతున ఇన్సెంటివ్ ఇచ్చారని తెలిపారు. అర ఎకరం సాగుచేసిన వారికి రెండు, మూడు ఎకరాలు సాగు చేసినట్లు చూపించి అధికంగా ప్రోత్సాహకాలను మంజూరు చేశారని చెప్పారు. గత ఏడాది పట్టుగూళ్లు నష్టపోయిన రైతులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో రూ.11.30లక్షలు అందజేశారని, అయితే ఇందులోనూ పలువురు రైతులకు అన్యాయం జరిగిందని వారు వివరించారు. సెరీకల్చర్ రైతులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం అందించే పథకాలను పక్కదోవ పట్టిస్తున్నారని వారు ఆరోపించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే చినరాజప్ప


ఫారంపాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని రాయభూపాలపట్నం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మానవ మనుగడకు నీరు జీవనాధారమన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతీ నీటిబొట్టును జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించార౯. ప్రభుత్వం నీటి సంరక్షణకు ఎన్నో చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంకుడు గుంతలు, ఫారం పాండ్స్ ఉపాధి హామీ ద్వారా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పశువుల షెడ్డును ప్రారంభించి ఫారం పాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, ఎంపీడీవో శ్రీలలి త, ఏపీవో రాయి కమలాకర్‌రావు, కూటమి నేతలు కస్తూరి శ్రీనివాస్, మన్యం ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దాపురం పట్టణంలో 18వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో పెద్దాపురం మహారాణి కళాశాల, సూరంపాలెం ప్రగతి కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థులు, 18వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ కె.మహ్మద్ ఆసీఫ్, మహారాణి కళాశాల కరస్పాండెంట్ రమేష్, శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ ఏఎన్‌వో ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల కేర్ టేకర్ బి.ఆదినారాయణ, 18వ ఆంధ్రా బెటాలియన్ సేబేదార్, డి.గణేష్, హవల్దార్ సురేష్, హవల్దార్‌బికాష్ పాల్గొన్నారు.

సామర్లకోట: ప్రపంచ జల దినోత్సవం పురష్కరించుకుని శనివారం సామర్లకోట మండలం ఉండూరులో జాతీయ ఉపాధి హామీ నిధులతో తవ్వించిన ఫారంపాండ్ చెరువును సామర్లకోట ఎంపీడీవో కె. హిమమహేశ్వరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొర్ల బుల్లయ్యరికాపు, టీడీపీ నాయకులు కొప్పిరెడ్డి రాజా, సలాది తాతాజీ, బత్తుల రామారావు, కొప్పిరె ఠిడ్డి సాంబమూర్తి, పేపకాయల సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సామర్లకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం, ప వర గ్రామాలకు చెంది గొల్లపల్లి లక్ష్మణరావు, పేపకాయల సుబ్రహ్మణ్యం, పాక సూర్యావతి ల కు వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల నుంచి రూ.3,98.239 విలువ గల మూడు చెక్‌లను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం అందజేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయమైన అచ్చంపేటలోని స్వగృహంలో ఈ మేరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహి ంచారు. లక్ష్మణరావుకు రూ.75,066, సుబ్రహ్మణ్యంకు రూ. 2,93,712, సూర్యావతికి రూ.29,461ల చొప్పున పంపిణీ చేశారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అవగాహన


ఈఈ బాలకృష్ణను సత్కరిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వర్శిటీలో ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంపై అవగాహన సదస్సును ఓఎస్డీ, సివిల్ విభాగాధిపతి డి.కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 2030 నాటికి అందరికీ నీరు అందించాలని ప్రతిఒక్కరూ నీటిని సంరక్షించుకుంటూ భావితరాలకు అందించాలన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఈఈ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టునిర్మాణంలోభాగంగా 24గంటల్లో 32వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను పోయడంద్వారా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులలోకి చేరిందన్నారు. కార్యక్రమంలో సీఈ వి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ కులాల్లో చేర్చడం అభినందనీయం

పిఠాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఏ వర్గంలో ఉన్నామో తెలియక 12 సంవత్సరాలుగా కులధ్రువీకరణ పత్రాలు పొందేవీలు లేక పడుతున్న అవస్థలకు ఎట్టకేలకు పరిష్కారం లభించిందని బేడ(బుడ్గ) జంగమ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాశాఖ అధ్యక్షుడు వేములూరి రాజకుమార్, ప్రధాన కార్యదర్శి బోణం రవిశంకర్‌లు తెలిపారు. పిఠాపురం పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పిల్లలు చదువుకునేందుకు, ఉద్యోగ అవకాశాలకు ఇది అడ్డంకిగా మారిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్సీ వర్గీకరణ బిల్లులో బేడ జంగమ కులాన్ని ఎస్సీ ఏ కేటగిరిలో చేర్చడంతో తమ ఇక్కట్లు తీరనున్నాయని తెలిపారు. తమను ఎస్సీ వర్గీకరణ ఏ గ్రూపులో చేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇందుకు సహకరించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో సంఘం కోశాధికారి పెదపాటి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు వేములూరి నాగేశ్వరరావు, పేర్రాజు, లోకనాథం సూర్యప్రకాష్, గోళ్ల నాగేశ్వరరావు, తూము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుదల కోసం చేరువ కార్యక్రమం

● జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బందితో శనివారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ చేరు వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పోలీసుల పనితీరు, ప్రజలు పోలీసుశాఖ నుంచి ఏమి కోరుకుంటున్నారు, రాబోయే రోజుల్లో పనితీరు మెరుగుదల కోసం చేరువ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, పేకాట, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని, దీంతో వారి జీవితం నాసనం అవుతుందన్నారు ప్రమాదకరంగా బైక్స్ డ్రైవింగ్ చేయడం, పాఠశాల పరిసర ప్రాంతాల్లో మద్యపానం సేవిస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు పోలీసులు తగిన చర్యలుతీసుకోవాలని కోరారు. ఇటువంటి సంఘటనలు జరిగితే పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 9494933233కి ఫోన్‌చేయాలి, ఫొటో, వీడియోతీసి వాట్సాప్ చేస్తేచర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి'

కాకినాడ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విలువైన జీవితం కోసం ప్రాణాలు కాపాడుకునేందుకు హెల్మెట్ ధరించాలని కాకినాడ ట్రాఫిక్-1,2 ట్రాఫిక్ సీఐలు రమేష్, డి.రామారావులు కోరారు. శనివారం కాకినాడలో నైట్ హెవక్ రైడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కోసం నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బైక్‌ల పై త్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్,సెల్‌ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగంతో ప్రయాణికులతో పాటూ వాహనదారులు క్షతగాత్రులుగా మారడంతో విలువైన జీవితాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మృతి చెందుతోన్న వారిలో యువతే అధికంగా ఉండటం దురదృష్టకరమన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రాణాలకు రక్షణతో పాటూ కుటుంబ సభ్యులకు భద్రత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బోట్‌క్లబ్ నుంచి అచ్చంపేట సెంటర్ వరకు పోలీసులు, విద్యార్థులు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పలువురు ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా

పిఠాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు డ్రోన్లతో నిఘా ఏర్పాటుచేశారు. పిఠాపురం పట్టణంలోని రైల్వేస్టేషన్, ఉప్పాడ రైల్వేగేటు, పాత షుగర్ ఫ్యాక్టరీ, రథాలపేట తదితర ప్రాంతాల్లో ఓపెన్ డ్రింకింగ్, గంజాయి సేవించే స్పాట్లును గుర్తించేందుకు గానూ డ్రోన్ల ద్వారా శనివారం సాయంత్రం ఏరియల్ సర్వే నిర్వహించారు. అన్ని అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఉంచుతున్నామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషక ఆహారం తీసుకోవాలి

● పోషణ అంశంపై ముగిసిన శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన బలవర్ధకమైన ఆహారం తీసుకునేలా చూడాలని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో జ్యోతి సూచించారు. అర్బన్ పరిధిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ స్కూల్, ముత్తనగర్, జగన్నాధపురం మున్సిపల్ స్కూల్‌లో గత మూడు రోజులుగా జరిగిన ట్రైనింగ్ ప్రోగ్రాం శనివారంతో ముగిశాయి. అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణతరగతుల కార్యక్రమంలో సీడీపీవో పాల్గొని పోషణ అంశంపై శిక్షణ ఇచ్చారు. పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాలలోపు చిన్నారులకు ఎదుగుదలకు నవచేతన, మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 22(ఆంధ్రజ్యోతి): సరస్వతి గానసభ వారి ఆధ్వర్యంలో మూడవ దశలో భాగంగా రెండవ రోజు శనివారం కాకినాడ సూర్యకళామందిరంలో వాణి రావు, భోపాల్, హిందుస్తానీ సాంప్రదాయ సంగీత కచేరి అత్యద్భుతంగా జరిగింది. సాంప్రదాయ సంగీతంలోనే కాకుండా గజల్స్, బాలీవుడ్, పాశ్చాత్య సంగీతాల్లో అత్యంత ప్రతిభావంతురాలు చిన్న వయస్సులోనే దేశ విదేశాల్లో అనేక కచేరీలు చేసి అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. వీరికి హార్మోనియంపై దామోదర్, భోపాల్, తబలాపై జావెద్ చక్కటి సహకారాన్ని అందించారు.

రెవెన్యూ అంశాలపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలి

● కాకినాడ ఆర్డీవో మల్లిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడసిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అంశాలపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో వివిధ రెవెన్యూ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ముఖ్యంగా అభ్యంతరంలేని భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఫ్రీ హోల్డ్ గ్రామ, మండల స్థాయిలో రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాల యంలో రికార్డు రూమ్, రికార్డు నిర్వహణకు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వేలో వచ్చే దర ఖాస్తులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఇనాం ఎస్టేట్ ఎబోలిషన్ యాక్ట్ పీవోటీ రికార్డ్ ఆఫ్ రైట్ భూఆక్రమణ కేసులలో, వెబ్ ల్యాండ్ తదితర రెవెన్యూ అంశాలలో ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణీత గడువులోగా చర్యలు తీసు కోవాలన్నారు. తహసీల్దార్లు వి.జి తేంద్ర, పి.త్రి నాధరావు, జీఆర్ ఠాగూర్, కె.సత్య నారాయణ, కె.చిన్నారావు, ఎన్.సత్య నారాయణ, కె.చంద్రశేఖరరెడ్డి, ఎస్ఎల్ఎన్ కుమారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.9లక్షల చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, మార్చి2 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వార్ఫ్‌రో డ్‌లోని పార్శిల్ సర్వీసెస్‌లో జరిగిన పేలుడు పదార్థాల విస్ఫోటన ఘటనలో మృతి చెందిన గజ్జల మద్దిలేటి కుటుంబానికి రూ.9లక్షలు ఆర్థిక సాయం చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అందజేశారు శనివారం స్థానిక సంజయ్ నగర్‌లోని మృతుని ఇంటి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఈ ఘటనలో గాయపడిన బాధిత కుటుంబాలు బొండు అశోక్‌కు రూ.లక్షా యాభైవేలు, బొందల పోతురాజుకు రూ.50వేలు, దారా నగేష్‌కు రూ.50వేలు సాయంను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కొండ బాబు అందజేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, మినీ గూడ్స్ వ్యాన్ యూనియన్ అధ్యక్షుడు రమణ, కార్మిక నాయ కుడు తాళ్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచి మంచి నడవడిక అలవర్చుకోవాలి

● ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరీ



చిత్రాడలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరీ

పిఠాపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే మంచి నడవడిక అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరీ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో పోక్సో చట్టం, ప్రపంచ జలదినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలుకు బ్యాడ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని చెప్పారు. పిఠాపురం బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, సీనియర్ న్యాయవాదులు బి.లక్ష్మణదొర, బంగారు రామకృష్ణ, దల్లి శ్రీనివాస్, ముమ్మిడి రామకృష్ణ, శ్రీనివాస్, కె.విజయకుమార్, సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ కర్రిదుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకట్, ఏఎస్ ఐ సుబ్బారావు, హెచ్‌ఎం విజయదుర్గ పాల్గొన్నారు.

●మండలంలోని గోకివాడలో పోక్సో చట్టంపై నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి పాల్గొని చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కీర్తి హరనాథబాబు తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకట అపర్ణ న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.

పోక్సో చట్టంపై అవగాహన


కరప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం బాల బాలికలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసదస్సుకు కాకినాడజిల్లా జూనియర్ సివిల్ జడ్జి సెకండ్ అడిషనల్ ఎం.ప్రసన్నలక్ష్మి విచ్చేసి పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే పిల్లల్లో పెరుగుతున్న నేరప్రవృత్తి, సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం, గాడితప్పుతున్న బాల్యం, చట్టాలు, శిక్షల గురించి వివరించారు. ఎస్ఐ తోట సునీత మాట్లాడుతూ విద్యార్థులు చదువు ప్రాముఖ్యతను తెలుసుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఎన్.ప్రసాద్‌కుమార్, వి.రామమోహన్, టి.శ్రీనివాస్, సీహెచ్.భారతి, కేఎస్ఎన్ మూర్తి, కె.పెద్దింటమ్మ, బి.పుష్పలత, పీడీ బి.చంద్రశేఖర్, కె.సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.


మరిడమ్మతల్లికి పూజలు చేస్తున్న జిల్లా కోర్టు జడ్జి

మరిడమ్మను దర్శించుకున్న జిల్లా కోర్టు జడ్జి

పెద్దాపురం, మార్చి22(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణంలో ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానానికి శనివారం కాకినాడ 6వ కోర్టు జిల్లా జడ్జి నిభిత ఆర్యోరా, జిల్లా జడ్జి దీపదైవకృప విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించి సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తుల రద్దీ



పెద్దాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి గ్రామంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత శృంగార వల్లభ స్వామివారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని శనివారం సుమారు 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,34,930, అన్నదాన విరాళం ద్వారా రూ.56,205, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.24,915 మొత్తం రూ.3,22,150 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశామని సుమారు 4500మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ చార్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశీలు బహిరంగ వేలం వాయిదా

గొల్లప్రోలు, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఆశీలు వేలం మూడోసారి వాయిదా పడింది. 2025-26కిగానూ పట్టణ పరిధిలో జనరల్ డైలీ మార్కెట్, రోడ్డు మార్జిన్లల్లో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకుగానూ మూడుసార్లు నిర్వహించిన వేలంలో కనీస పాట మొత్తాన్ని తగ్గించాలని హాజరయిన వారు కోరారు. దీంతో వేలాన్ని వాయిదా వేశారు. ఈనెల 24న మధ్యాహ్నం 3గంటలకు టెండర్ కమ్ వేలంపద్ధతిలో నగరపంచాయతీ కార్యాలయం లో వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కనకారావు తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండువద్ద గల మునిసిపల్ అతిథిగృహం ఆవరణలోని పాడా కార్యాలయంలో ఈనెల 24న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు పాడా ప్రా జెక్టు డైరెక్టర్ ఏ.చైత్రవర్షిణి తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను పీజీఆర్ఎస్‌లో అందజేయాలని సూ చించారు. అన్నిశాఖల అధికారులు పీజీఆర్ఎస్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: పాడా పీడీ

కొత్తపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పాడా పీడీ చైతన్యవర్షిణి అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి మండలం మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను ఆమె శనివారం పరిశీలించారు. అనంతరం పాఠశాల పేరెంట్స్‌కమిటీ సభ్యులు, గ్రామస్థులతో వివిధ అభివృద్ధిపనులపై చర్చించారు. డీఎల్‌డీవో వసంత మాధవి, ఎంఈవో బుర్రా వేణుగోపాల్, మండల ఇంజనీర్ గరగ శ్రీనివాసరావు,ప్రధానోపాధ్యాయులు గుబ్బల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్యాలీపై ముగిసిన శిక్షణ

జేఎన్టీయూకే, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వర్శిటీలో ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే, యూసీఈకే అధ్యాపకేతర సిబ్బందికి వారంరోజులపాటు నిర్వహించిన ట్యాలీ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో సమాచార నిర్వహనంతా డిజిటలైజ్ అవుతున్నదని కాబట్టి ప్రతీఒక్కరూ ట్యాలీ సాఫ్ట్‌వేర్‌పై పట్టుసాధించాలన్నారు. సీఎం నారాచంద్రబాబు ప్రతీ ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలలో కాగిత రహితంగానే కార్యకలాపాలు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వర్శిటీలో ఏ అంశమైనా ఈ-ఆఫీస్‌ద్వారానే పంపించాలన్నారు. అనంత రం సిబ్బందికి సర్టిఫికెట్లను రిజిస్ట్రార్ రవీంద్రనాద్ చేతుల మీదుగా అందజేశారు.

రేపు గ్రామసభలు

శంఖవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శంఖవరం మండల పరిషత్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయితీలో ఈనెల 24న ఉదయం 10గంటలకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శర్మ తెలిపారు. దీనికి సంబంధించి పి4 సర్వే జాబితాను ఆయా పంచాయితీల్లో నోటీసు బోర్డులో ఉంచినట్లు వాటిని సరిచూసుకోవాలని ఆయన కోరారు. గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఏజెన్సీలో 3వేల ఫారంపాండ్లు మంజూరు

రంపచోడవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏజెన్సీ ఏడు మండలాల్లో మూడు వేల ఫారంపాండ్లు మంజూరు చేసినట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. శనివారం పందిరిమామిడిలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. గిరిజన రైతులు ఫారంపాండ్ల ద్వారా నీటిని నిల్వ చేసుకుని చేపలు పెంచుకోవచ్చునని సూచించారు. రైతుల పొలాల్లో రూ.3.50లక్షలతో ఫారంపాండ్లను తవ్విస్తామన్నారు. ఏపీడీ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో మంజూరైన పనులను పర్యవేక్షణ చేసి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ చెదల వెంకటలక్ష్మి, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, ఏపీవో బి.సత్యనారాయణ, టీఏ వి.వీరన్న, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, చవలం బాపిరాజు, పి.అనంతమోహన్, పండా చెల్లన్నదొర, పాటోజు సురేష్, గణపతి పాల్గొన్నారు.

దేవాలయాలను సందర్శించిన ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

వీఆర్‌పురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామగిరి కొండపై కొలువై ఉన్న, రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీసుందరసీతారామస్వామి దేవాలయాన్ని, వడ్డిగూడెంలో వేంచేసి యున్న శ్రీరుద్ర కోటీశ్వరస్వామి ఆలయాన్ని శనివారం జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.ఎల్. సుధారాణి సందర్శించారు. ఆలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీరామగిరి దేవాల యాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా పుష్కర ఘాట్లను పరిశీలించారు. వడ్డిగూడెం శివాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు బొర్ర నరేష్‌కుమార్, ఆచంటి శ్రీను, ఆలయ అధికారి సాయిబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామగిరి దేవాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ సుధారాణి

ప్రపంచ జల దినోత్సవం

దేవీపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా దేవీపట్నం పంచాయతీ ఇందుకూరు-1లో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఫారం పాండ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు లంక హరిబాబు, గేదెల పెద్దసుబ్బారావు, కూటమి నాయకులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫారంపాండ్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఫారంపాండ్ పనులు ప్రారంభం



ఫారంపాండ్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19పంచాయతీల్లోని గ్రామాల్లో శనివారం ఫారం పాండ్ పనులు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ గ్రామ పొలాల్లో ఫారంపాండ్స్ నిర్మించి నీటి వసతి మెరుగు పరచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. లాగరాయికి చెందిన కానెం చిన్నయ్య, సూరంపాలేనికి చెందిన ఈక పెంటయ్య పొలాల్లో ఫారంపాండ్ పనులను ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు ప్రారంభించారు. బొడ్లగంది గ్రామ పొలాల్లో ఫారంపాండ్ పనులను చిరాబుకిర్రబు సర్పంచ్ బుజ్జమ్మ ప్రారంభించారు. ఫారంపాండ్ వల్ల కలిగే ప్రయోజనాలు ఎంపీడీవో యాదగిరేశ్వరరావు, ఏపీవో రెడ్డిబాబు వివరించారు.

గుండువారిగూడెంలో అగ్ని ప్రమాదం



కూనవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండువారిగూడెం గ్రామానికి దగ్గరలో ఉన్న తాడిచెట్లు, భారీగా ఉన్న పొదలకు శనివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఐదు తాడి చెట్లు, పొదలు కాలిపోయ్యాయి. ఈనేపథ్యంలో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురై ఇళ్లల్లో నుంచి పరుగులు తీశారు. గ్రామానికి అతిదగ్గరలో ఉన్న చెట్లకు సైతం మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో గ్రామప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

వాహనాల తనిఖీ

కూనవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కూనవరం ఎస్‌ఐ లతాశ్రీ వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న కూనవరం ఎస్‌ఐ లతాశ్రీ

బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ

రాజవొమ్మంగి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి దేవామణి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బీ పడాయీ బీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించారు. సూపర్‌వైజర్లు పి.అరుణలత, ఎస్.నాగజయలక్ష్మి, బి.అమ్మిరాజు, ఎస్.అమ్మాజీ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

- జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ
- ఘనంగా ప్రపంచ జల దినోత్సవం
- పలువురు రైతుల పంట పొలాల్లో నీటి కుంటల ఏర్పాటు
- నీటి పొదుపుపై పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

కుంటలతో నీటి సామర్థ్యం మెరుగు



కె.గోపాలపురంలో నీటి కుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో ఏర్పాటు చేసుకునే నీటి కుంటల వల్ల బోర్లు నీటి సామర్థ్యం పెరుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గండేపల్లి మండలం కె.గోపాలపురంలో నిర్మించిన పంట నీటి కుంటలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే కాలంలో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం రాకుండా చుట్టూ ఉన్న ఏలేరు రిజర్వాయర్, సూరంపాలెం, భూపతిపాలెం రిజర్వాయ్‌లతో పాటు పంట పొలాల్లో ఏర్పాటు చేసుకునే ఇటువంటి నీటి కుంటల వల్ల బోర్లు నీటి సా మర్థ్యం కూడా పెరుగుతుందన్నారు. పంట నీటి కుంటలను ఏర్పాటుచేసుకున్న బుదిరెడ్డి నరసయ్యమ్మను అభినందించి మిగతా రైతులు ముం దుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాతి బుజ్జి, టీడీపీ నాయకులు పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, గీతారామచంద్రవర్మ, బాలసుబ్రహ్మణ్యం, ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్, టీఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: ఎస్‌అర్‌పేట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటనారాయణ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడి భూగర్భజలాలు అడుగంటకుండా చూసుకోవాలన్నారు. నీటిని వృథా చేయకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫారమ్ పాండ్స్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. రూ.30 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో రాజగోపాల్, కార్యదర్శి నాగరాజు, టీడీపీ నాయకులుపాల్గొన్నారు.

తొండంగి: జాతీయ నీటి దినోత్సవాన్ని పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కాకినాడ నెహ్రూ యువకేంద్రం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెహర్ నీటి లభ్యత, నీటి పొదుపు తదితర అంశాలు వివరించారు. ఎస్.ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ దివాకర్ రావు, పి.మహాలక్ష్మి, కె.బాలసిద్దార్థబాబు, ఆనంద్ శ్రీనివాస్, వై.నాగేశ్వర్రావు పాల్గొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో జలవనరులను వివరించి వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎ.శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీదేవి, జయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని వాకపల్లిలో గండి యమున వ్యవసాయ క్షేత్రంలో నీటిసేద్యపు గుంత నిర్మాణానికి ఎంపీడీవో ఎంవీ ఆర్ కుమార్ బాబు శంకుస్థాపన చేశారు.వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వల కోసం ఫారమ్ పాండ్‌ల ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రొం గల నాగేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో కుమార్‌స్వామి, స్థానిక నాయకులు కురందాస్ అప్పలరాజు, చలపతిరావు, కురందాస్ బాబురావు, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, టెక్నికల్ అసిస్టెంట్ భాను ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.



ఎస్‌అర్‌పేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదివాసీల భూములకు పట్టాలివ్వాలి

- ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా.. వినతి



ప్రతిపాడులో ధర్నా చేస్తున్న వంతాడ గిరిజనులు

ప్రత్తిపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వంతాడ గిరిజన గ్రామంలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ.గోకవరం పంచాయతీ వంతాడ గిరిజన కొండపై కొండ దొర కులాలకు చెందిన 69 కుటుంబాలు భూములను సాగు చేసుకుంటున్నారని, వారికి హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు నాయకత్వం వహించిన సీపీఐ ఎంఎల్ వినోద్‌మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కొనిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ లింగంపర్తి సెక్షన్ 589 బీట్ కంపార్టుమెంట్‌లో వంతాడ గిరిజనులు జీడిమామిడి తోటలు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, అయితే వీరి భూములకు అభివృద్ధి పనులు కానీ, ఉపాధి హామీ పనులు కానీ మంజూరు కాలేదని, 150 గిరిజన షెడ్యూల్ తెగలకు చెందిన కొండ దొర కులానికి చెందిన గిరిజనులు ఈ భూములు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ భూములకు కొంతమంది రాజకీయ పెత్తందారులు పట్టాలు మంజూరు కానీయకుండా అడ్డుకుంటున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఆందోళనలో ఉల్లి తాతారావు, కుడే రాఘవ, మాతే దుర్గబాబు, ఉల్లి లవకుశ, మాతే లోవరాజు, ఈరట సత్తిబాబు, రెడ్డిబాబు, లోవరాజు, కొండమ్మ పాల్గొన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సూర్యప్రభకు అందజేశారు.

'ఆదిత్య'లో ముగిసిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

గండేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 శనివారంతో ముగిసిందని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. యువత స్వరాన్ని వినిపించేందుకు ఇటువంటి వేదికలు కీలకపాత్ర పోషిస్తాయని వైస్ ఛాన్సలర్ ఎంబి.శ్రీనివాస్ అన్నారు. ప్రతిభ కనబరిచిన 10మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని యూత్ ఆఫీసర్ కిషోర్ దూలం తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

చేతి వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆదరణ పథకంపై అవగాహన కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకం ద్వారా చేతి వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆదరణ కార్యక్రమంపై మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వివిధ కుల వృత్తి దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆదరణ పథకం ద్వారా చేతి వృత్తిదారులకు ఉచితంగా పని ముట్లు అందజేశారన్నారు. అదే విధంగా ఈ ప్రభుత్వంలో ఆదరణ పథకాన్ని అమలుచేస్తున్నట్టు ఎంపీపీ తెలిపారు. మండలంలోని ఎర్రవరంలో సేద్యపు నీటి కుంట నిర్మాణ పనులకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో సూర్యనారాయణ, బస్వా ప్రసాద్, షైరాల కనకారావు, తోట వెంకటేశ్వరరావు, గంగిరెడ్ల మణికంఠ పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదరణ-3 పథకంపై అవగాహన కల్పించారు. వెనుకబడిన తరగతుల జీవనోపాధి కోసం కులవృత్తులు చేసుకునేందుకు అవసరమయ్యే పరికరాలు పంపిణీ చేసేందుకు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీలు

గండేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సామాజిక తనిఖీలు పారదర్శకంగా జరగాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. శనివారం మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన సామాజిక తనిఖీకి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి వంద రోజులు పని కల్పించే విధంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని, ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామస్తులు, ప్రజాప్రతినిధులకు వివరాలు తెలపకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ బదులు వేరొకరు విధులు నిర్వహిస్తున్నారని అది ఎంతవరకు సమంజసమని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.

చిన్నపిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ఏలేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ తెలిపారు. శనివారం అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ భీ-పడాయి, 0-6 నెలల పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి మహిళ, స్త్రీ శిశు సంక్షేమశాఖ రూపొందించిన నవచేతన, ఆదర్శ శీల, దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణలపై అంగన్ వాడీలకు కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తుందన్నారు.

కోరం లేక తొండంగి మండల సమావేశం వాయిదా

తొండంగి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తొండంగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా శనివారం వాయిదా పడింది. ఉదయం పదిన్నరకు ఎంపీపీ సువర్ణలత అధ్యక్షతన సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించగా మొత్తం 25 మంది సభ్యులకు గాను ఎంపీపీతో పాటు 8 మంది మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో రాజేశ్వర్రావు పలువురు సభ్యులకు ఫోన్లు చేసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అయినప్పటికి కోరంకు సరిపడా సభ్యులు హాజరుకాకపోవడంతో 2సార్లు సమావేశాన్ని వాయిదా వేశారు. ఎక్కువ సమయం వేచిచూచినప్పటికీ కోరానికి సరిపడా 9 మంది సభ్యులు హాజరుకాకాపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

మత్స్యశాఖ అధికారి తీరుకు సంఘ సభ్యుల నిరసన

ఏలేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ అధికారి రాజేంద్ర తీరుపై మత్స్యశాఖ సంఘ సభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. మండలంలోని మర్రివీడు గ్రామంలో ఉన్న మత్స్యకారులను చిన్న చూపు చూస్తున్నారని, ఏలేరు జలాశయం వద్ద చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలలో జాప్యం చూపుతున్నారని ఆందోళన చేపట్టారు. తమకు రావల్సిన లైసెన్సులు, వేటలో ఉపయోగించే వలలు, తమ సమస్యలపై ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందిచండంలేదని, రాజేంద్ర తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సత్యదేవునికి ప్రాకారసేవ

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి శనివారం ప్రాకార సేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి బాజాభజంత్రీల నడుమ తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

కిసాన్ సంఘ్ సమావేశం

ప్రత్తిపాడు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ చెరువుల్లో పూడిక తీత పనుల్లో వచ్చే మట్టిని రైతుల పొలాలకు మళ్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి కొనూరి పతిరాజు కోరారు. ప్రత్తిపాడులో సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్యక్షత శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి పతిరాజు విచ్చేసి మాట్లాడారు. ఖరీఫ్, దాళ్వా పంటలు పూర్తయిన వెంటనే పంట కాలువలు తవ్వించాలన్నారు.

ఏలేశ్వరం తహశీల్దార్‌గా ఆనంద్

ఏలేశ్వరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం తహశీల్దార్‌గా ఆనంద్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతి సెక్రటరీయేట్ నుంచి బదిలీపై ఆనంద్ కుమార్ ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహశీల్దార్‌గా ఉన్న కుశరాజు తమ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులను నిర్వర్తించనున్నారు. ఆనంద్‌కుమార్‌కు ఆర్ఐ పొన్నాలు, వీఆర్వోలు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

'నిస్వార్థ సేవకులకు సముచిత గుర్తింపు'

టీడీపీలో దళిత నేతల చేరిక



టీడీపీలోకి చేరిన వారితో యనమల రామకృష్ణుడు

తుని రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గ టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. తాజాగా తొండంగి మండలం రావికంపాడు గ్రామ దళిత నేతలు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో పాకా ఏసుబాబు, సారిక నానిబాబు, సవాలం గోపి, మంతెన అదృష్టం, గుల్లపెద్ద శ్రీను, శివకోటి మరిడబ్బాయి తదితరులతో సహా హరిజనవాడకు చెందిన వంద మంది టీడీపీలోకి చేరారు. వారికి పసుపు కండువాలు వేసి యనమల ఆహ్వానించారు. నిస్వార్థంగా సేవలందించే వారికి సముచిత గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, సిద్దా రాంబాబు, వెల్నాటి పాపయ్యరాజు, అరిగెల నర్సింహమూర్తి, పోసిన నందిబాబు, వెల్నాటి భరత్, మురళి, ఆదం బాబ్జి పాల్గొన్నారు.

మామిడి తోటలను పరిశీలించిన ఉద్యాన శాస్త్రవేత్త

తొండంగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తామర పురుగు ఉధృతితో మామిడి పూత మాడిపోతుండగా దానిని పరిశీలించే నిమిత్తం ఉద్యాన శాఖ శాస్త్రవేత్త చిన్నారావు గురువారం బెండపూడి గ్రామంలో పర్యటించారు. మామిడి తోటల్లో తామరపురుగు ఉధృతిని గమనించారు. దీని నివారణకు ట్రేసర్ వాడమని సూచించారు. ఎక్స్లెనస్ మందు 34 మిలీ లీటర్లు 140 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల నల్లతామర పురుగు శాశ్వతంగా తగ్గుతుందని తెలిపారు. సాధారణ పురుగు మందులు పిచికారీ చేసినపుడు ఈ పురుగు మరింత శక్తిని పొంది ఉధృతి పురుగుతుందన్నారు. దీని నియంత్రణకు జీవనియంత్రణ పద్దతిలో బెవేరియా బెస్సియా ఫంగస్‌ను వాడాలన్నారు. ఉద్యానశాఖాధికారి విజయలక్ష్మి, తాతాజీ పాల్గొన్నారు.

'దాతలు తోడ్పాటునందించాలి'

ప్రత్తిపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండపై నిర్మాణ దశలో ఉన్న ఆంధ్ర భద్రాద్రి రామాలయ క్షేత్ర అభివృద్ధికి దాతలు తోడ్పాటునందించాలని ఆ క్షేత్ర అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి చేసింది. క్షేత్రం వద్ద శనివారం కులగిరి క్షేత్ర శ్రీరామదేవస్థానం కమిటీ సమావేశం నిర్వహించింది. నరేంద్రగిరి కొండపై నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను కమిటీ సభ్యులు వివరించారు. అనంతపల్లి శ్రీనివాస్, రెడ్నం రాజా, గోగుల వెంకటేశ్వరరావు, పత్రి రమణ, అద్దేపల్లి రాజు, సానా నూకరాజు నాయుడు, పాల్గొన్నారు.

సత్ ప్రవర్తనతో మెలగాలి

తుని రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చట్టానికి లోడి సత్ప్రవర్తనతో మెలగాలని తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు స్పష్టం చేశారు. ఎన్.సురవరం గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గయువతతో సమావేశం నిర్వహించారు. ఆయన ఎస్సీ వర్గీకరణ సంబంధించి తమ అభిప్రాయాలు రాత పూర్వకంగా అధికారులకు సూచించారు. ఐపీఎల్ బెట్టింగ్‌తో పాటు జూద క్రీడలకు దూరంగా ఉండాలని, యువత సన్మార్గలను ఎంచుకుని ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని తెలిపారు.

హిజ్రాల ఆందోళన

ఏలేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో హిజ్రా దీపును హత్య చేసిన నిందుతుడు బన్నీ దిష్టి బొమ్మను శనివారం రాత్రి హిజ్రాలు దగ్ధం చేశారు. ఏలేశ్వరం పాత బస్‌స్టాండ్ నుంచి నిరసన తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాలాజీ చౌక్ సెంటర్‌లో నినాదాలు చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్ర భుత్వం చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరాని చెందిన కిడ్నీ బాధితరాలు కంతోజు హేమ శ్రీలక్ష్మికి శనివారం ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.10వేలు ఆర్థిక సహాయం చేసి చేయూతనందించారు. స్థానిక నాయకులు జువ్వల దొరబాబు, కోలా తాతబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, దోమలంక బాబ్జి, నానిపల్లి నాని, జువ్వల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరులో అపరాల కొనుగోలు కేంద్రం

కోటనందూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు రైతు కొనుగోలు కేంద్రం వద్ద అపరాలు కొనడానికి ఏర్పాట్లు చేశామని మండల వ్యవసాయధికారి చంద్రశేఖర్ తెలిపారు. అందులో కందులు క్వింటా రూ.7550, మినుములు రూ.7400 క్వింటా కాగా, పెసరలు రూ.8682 క్వింటాగ నిర్ణయించారు. రైతులందరు దళారులను నమ్మిమోస పోవద్దని, రైతు సేవా కేంద్రం వద్ద అమ్మాలని సూచించారు.